ప్రజాశక్తి
శనివారం 29 జూన్ 2024 5 విజయనగరం



జిల్లా ప్రధాన న్యాయమూర్తిని కలిసిన కలెక్టర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణచక్రవర్తిని జిల్లా కలెక్టర్ డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా న్యాయ స్థానంలోని ఆయన ఛాంబర్‌లో కలిసి, పుష్ప గుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం కొద్దిసేపు జిల్లాకు సంబంధించిన అంశాలపై చర్చించారు. కలెక్టర్ వెంట ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ కూడా ఉన్నారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందిస్తున్న కలెక్టర్

నిర్మాణంలో ఉన్న ఈ భవనంలోనే తరగతులు నిర్వహిస్తున్నారు

నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహించడం చట్టరీత్యా నేరం. అయినా, పట్టణంలో శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం.. అందులోనే తరగతులు నిర్వహిస్తూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం ఆడుతోంది. విద్యార్థుల భద్రతను గాలికొదిలేసింది. కాసులకు కక్కుర్తి పడుతున్న అధికారులు అటువైపు చూడటం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ఎవరిది బాధ్యతని ఎస్ఎఫ్ఐ నాయకులు ప్రశ్నిస్తున్నారు.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం

- నిర్మాణ భవనంలో శ్రీచైతన్య కళాశాల తరగతుల నిర్వహణ
- భద్రతను పట్టించుకోని యాజమాన్యం
- కాసులకు కక్కుర్తిపడి చర్యలకు వెనకడుగేస్తున్న అధికారులు
- ప్రమాదం జరిగితే ఎవరిది బాధ్యత? : ఎస్ఎఫ్ఐ నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

పట్టణంలోని రైల్వే ఫ్లైఓవర్ డౌన్‌లో ఆంజనేయ స్వామి ఆలయం వద్ద శ్రీచైతన్య కళాశాల ఏర్పాటు చేశారు. కళాశాల నిర్వాహకులు అద్దెకు తీసుకున్న భవనం నిర్మాణ పనులు పూర్తి కాలేదు. ప్రస్తుతం పనులు చేపడుతూనే ఉన్నారు. అయినా, ఆ భవనంలోనే శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం తరగతులు నిర్వహిస్తోంది. తరగతుల నిర్వహణ చట్టరీత్యా నేరమైనప్పటికీ ఉన్నత విద్యాశాఖాధికారులు కాసులకు కక్కుర్తి పడి శ్రీచైతన్య కళాశాల యాజమాన్యానికి చర్యలు తీసుకోకుండా తరగతులు నిర్వహణకు సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహించకూడదని నిబంధనలు ఉన్నా.. ఒకవైపు తరగతులు నిర్వహిస్తూనే, మరో వైపు భవన నిర్మాణ పనులు చేస్తున్నారు.

అనుమతులు లేకుండానే

బొబ్బిలిలో శ్రీచైతన్య కళాశాల నిర్వహణకు ప్రభుత్వం ఎటువంటి అనుమతులూ మంజూరు చేయలేదు. అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపట్టకూడదు. నిబంధనలేవీ పట్టించుకోకుండా అడ్మిషన్లు స్వీకరించి తరగతులు నిర్వహిస్తున్నారు. అనుమతులు లేకుండా తరగతులు నిర్వహించి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్న శ్రీచైతన్య కళాశాల యాజమాన్యంపై చర్యలు తీసుకోవాల్సిన అధికారులు ఏమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. అంతేకాకుండా, శ్రీచైతన్య కళాశాల యాజమాన్యానికి అధికారులు సహకరిస్తున్నట్లు ఆరోపణలు కూడా ఉన్నాయి.

కాసుల కక్కుర్తి

ఓవైపు అనుమతులు లేకుండా అడ్మిషన్లు స్వీకరించారు. మరోవైపు నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహిస్తున్నారు. రెండూ నిబంధనలు ఉల్లంఘనలైనా విద్యాశాఖాధికారులు పట్టించుకోవడం లేదు. శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం వద్ద అమ్యామ్యాలు తీసుకుని సహకరిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. కళాశాల భవనాన్ని విద్యాశాఖాధికారులు పరిశీలించినా చర్యలు తీసుకోలేదని విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా విద్యాశాఖాధికారులు స్పందించి శ్రీచైతన్య కళాశాల యాజమాన్యంపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

కళాశాల వద్ద ఎస్ఎఫ్ఐ నిరసన

అనుమతులు లేకుండా అడ్మిషన్లు చేపట్టి, నిర్మాణంలో ఉన్న భవనంలో తరగతులు నిర్వహించడంతో శ్రీచైతన్య కళాశాల వద్ద శుక్రవారం ఎస్ఎఫ్ఐ నాయకులు నిరసన తెలిపారు. విద్యార్థుల జీవితాలతో శ్రీచైతన్య కళాశాల యాజమాన్యం చెలగాటం ఆడుతున్నా అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. వెంటనే అధికారులు స్పందించి చర్యలు తీసుకోకుంటే పోరాటం ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు దేవిడ్, తదితరులు పాల్గొన్నారు.

శ్రీచైతన్య కళాశాలపై చర్యలు తీసుకోవాలి

ఆర్ఐఒకు ఎస్ఎఫ్ఐ నాయకుల వినతి

విజయనగరం టౌన్ : బొబ్బిలిలో ఎటువంటి అనుమతులు లేకుండా తరగతులు నిర్వహిస్తున్న శ్రీ చైతన్య యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఎస్ఎఫ్ఐ నాయకులు ఆర్ఐఒ ఆదినారాయణకు శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు జె .రవికుమార్ మాట్లాడుతూ ఒకపక్క నిర్మాణ పనులు సాగుతుంటే మరోపక్క తరగతులు నిర్వహించడం సరైనది కాదని తెలిపారు. నిర్మాణం జరుగుతున్నప్పుడు విద్యార్థులు గాయపడితే ఎవరిది బాధ్యతని ప్రశ్నించారు. కళాశాలలో విద్యార్థులకు కనీసం మరుగుదొడ్ల సదుపాయం కూడా లేదని, జాతీయ రహదారి పక్కనే ఈ భవనం ఉండటం వల్ల విద్యార్థులు కాలకృత్యాలకు రోడ్లు దాటుకొని వెళితే ప్రమాదాలకు గురయ్యే అవకాశం ఉందని అన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులు తీసుకోవాలని ఆర్ఐఒను కోరారు. కళాశాలను సందర్శించిన ఎస్ఎఫ్ఐ బృందంపై కళాశాల యాజమాన్యం దౌర్జన్య వైఖరిని అవలంభించిందని, ఈ పద్ధతి మానుకోకపోతే విద్యార్థుల నుండి తీవ్రమైన ఆందోళనను చవి చూస్తారని హెచ్చరించారు. వినతి ఇచ్చిన వారిలో ఎస్ఎఫ్ఐ పట్టణ కార్యదర్శి పి రమేష్, నాయకులు వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్ఐఒకు వినతి అందిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

తోటపల్లి నీరు విడుదల

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని సర్దార్ గౌతు లచ్చన్న తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు నీటిని శుక్రవారం రాష్ట్ర మహిళా శిశు సంక్షేమ, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి విడుదల చేశారు. తోటపల్లి బ్యారేజ్ ప్రాజెక్టు కుడి ప్రధాన కాలువ వద్ద జరిగిన కార్యక్రమంలో పాలకొండ, కురుపాం ఎమ్మెల్యేలు నిమ్మక జయకృష్ణ, తోయక జగదీశ్వరి సమక్షంలో మంత్రి నీటిని విడుదల చేశారు. కుడి ప్రధాన కాలువ ద్వారా ప్రాజెక్టు కింద మొత్తం 1,31,221 ఎకరాల ఆయకట్టుకు నీరందనుంది. కుడి ప్రధాన కాలువ కింద సీతానగరం, బలిజిపేట మండలాల్లో 27 గ్రామాలకు చెందిన 13,684 ఎకరాలకు సాగునీరందుతుండగా, విజయనగరం జిల్లాలోని బొబ్బిలి, చీపురుపల్లి, నెల్లిమర్ల, రాజాం నియోజక వర్గాలలోని 13 మండలాల్లో 66 గ్రామాలకు చెందిన 25,060 ఎకరాలు, శ్రీకాకుళం జిల్లాలో ఎచ్చెర్ల నియోజకవర్గంలో జి.సిగడాం, లావేరు, రణస్థలం మండలాల్లో 105 గ్రామాలకు చెందిన 38,975 ఎకరాలకు సాగునీరందుతుంది. 1,31,221 ఎకరాల్లో 84,033 ఎకరాలు స్థిరీకరణ, 47,188 ఎకరాలు కొత్త ఆయకట్టు గా ఉంది.

ప్రాజెక్టు వద్ద పూజలు చేస్తున్న మంత్రి సంధ్యారాణి

కార్యక్రమంలో మన్యం జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్, ఉత్తర కోస్తా జలవనరుల శాఖ చీఫ్ ఇంజనీర్ ఎస్.సుగుణాకరరావు, ఎస్ఇ రాజరాజేశ్వరి, ఇఇలు జి.రామచంద్రరావు, ఆర్.అప్పలనాయుడు, డిఇ శ్రీహరి, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

డిఎస్‌సి కోసం ఎదురుచూపు

వందల్లో పోస్టులు.. వేలల్లో అభ్యర్థులు ● పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఐదేళ్లుగా డిఎస్‌సి నిర్వహించకపోవడంతో జిల్లాలో బిఎడ్, డిఎడ్ చేసిన నిరుద్యోగ అభ్యర్థులు తాజాగా ప్రభుత్వం విడుదల చేయనున్న డిఎస్‌సి కోసం వెయ్యికళ్లతో ఎదురు చూస్తున్నారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో సుమారు 40వేల మంది అభ్యర్థులు ఉన్నారు. ఈనేపథ్యంలో ప్రస్తుతం ప్రభుత్వం చేపట్టనున్న డిఎస్‌సిలో పోస్టుల సంఖ్య పెంచాలని అభ్యర్థులు డిమాండ్ చేస్తున్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధికారంలోకి వచ్చిన తరువాత 16,347 ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం తొలి సంతకం చేశారు. దీంతో ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు విద్యా శాఖ అధికారులు చర్యలు చేపట్టారు. వైసిపి ప్రభుత్వం ఈ ఏడాది ఆరంభంలో ఇచ్చిన డిఎస్‌సి నోటిఫికేషన్‌లో జిల్లాకు 199 పోస్టులు కేటాయించారు. మార్చినెలాఖరుకు రాత పరీక్ష పూర్తి కావాల్సి ఉండగా,కొంతమంది అభ్యర్థులు కోర్టుకువెళ్లడం, ఈలోగా ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో డిఎస్‌సి నిలిచిపోయింది. తాను అధికారంలోకి వస్తే మెగా డిఎస్‌సిపైనే తొలి సంతకం అని చంద్రబాబు ప్రకటించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురించాయి. తాజాగా టిడిపి ప్రభుత్వం విడుదల చేయనున్న మెగా డిఎస్‌సిలో ఉమ్మడి విజయనగరం జిల్లా ప్రామాణికంగా ఎంపిక ప్రక్రియ చేపట్టనట్లు సమాచారం. ఈ డిఎస్‌సిలోఉమ్మడి జిల్లాకు 583 ఉపాధ్యాయ పోస్టులు ప్రకటించారు. అయితే ఇందులో ఎస్‌జిటి ఎన్ని, స్కూలు అసిసెంట్లు ఎన్ని అనే వివరాలు తెలియాల్సి ఉంది. డిసెంబర్ నెలాఖరునాటికి డిఎస్‌సి ప్రక్రియను పూర్తి చేసి అపాయింట్‌మెంట్ ఆర్డర్లు కూడా ఇస్తామని ఇటీవల విద్యాశాఖా మంత్రి లోకేష్ ప్రకటించడంతో నోటిఫికేషన్ కోసం అభ్యర్థులు ఎదురు చూస్తున్నారు. రాష్ట్రంలో 39 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని, టిడిపి

ప్రభుత్వం చేపట్టే డిఎస్‌సి ద్వారా కనీసం 25వేల పోస్టులను భర్తీ చేయాలని నిరుద్యోగులు, యువజన సంఘాల నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ప్రత్యేక ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలని కోరుతున్నారు.

ఖాళీలన్నింటినీ భర్తీ చేయాలి

రాష్ట్రంలో 39వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీ ఉన్నాయని కేంద్ర మంత్రి గతంలో ప్రకటించారు. డిఎస్‌సి ద్వారా ఆ పోస్టులన్నీ భర్తీ చేయాలి. దీనిపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలి. పాఠశాలల రేషనలైజేషన్ కోసం తీసుకొచ్చిన జిఒ 117ను రద్దు చేయాలి. రాష్ట్రంలో అన్ని శాఖల్లో ఖాళీగా ఉన్న 2.36 లక్షల పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలి. ఆ పోస్టులను భర్తీ చేసే వరకూ జులై నుంచే నిరుద్యోగ భృతి అమలు చేయాలి. ఉద్యోగ విరమణ వయసును 58 ఏళ్లకు తగ్గించాలి.

- సిహెచ్ హరీష్, డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు

1 నుంచి 'స్టాప్ డయేరియా' : ఎంహెచ్ఒ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జూలై 1వ తేదీ నుండి నెలరోజుల పాటు స్టాప్ డయేరియా కార్యక్రమాన్ని ముమ్మరంగా చేపట్టనున్నట్లు నగరపాలక సంస్థ ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి తెలిపారు. శుక్రవారం కార్యాలయ ఛాంబర్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వర్షాలు కురుస్తున్న పరిస్థితుల్లో డయేరియా ఇతర కాలానుగుణ వ్యాధులు సంక్రమించే అవకాశం ఉందని అన్నారు. ఈనేపథ్యంలో ప్రభుత్వం జూలై 1 నుంచి 30 రోజుల పాటు స్టాప్ డయేరియా కార్యక్రమం ద్వారా ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ముమ్మరం చేయాలని ఆదేశించిందన్నారు. దీని ప్రకారం ప్రజారోగ్య సిబ్బంది, కార్యదర్శులు ప్రతి సచివాలయ పరిధిలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు చెప్పారు. ముఖ్యంగా కాచి చల్లార్చిన నీటిని మాత్రమే ప్రజలు తాగాలని చెప్పారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించి నీటి నిల్వ ఉన్న ప్రాంతాలను శుభ్ర పరచాలన్నారు. డయేరియా బారిన పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

వైద్య సిబ్బందికి పింఛన్ల విధులా?

ప్రజాశక్తి-భోగాపురం

వైద్యశాఖలో పనిచేస్తున్న ఎఎన్ఎంలు, ఎంఎల్‌హెచ్‌పిలు, ఆశా కార్యకర్తలకు పింఛన్ల పంపిణీ విధులు అప్పగించడంపై ఎపిఎన్‌జిఒ అసోసియేషన్ తాలూకా అధ్యక్షులు కొమ్మూరు దుర్గారావు, మహిళా కార్యదర్శి పి.కృష్ణవేణి ఒక ప్రకటనలో అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాన్ని వెంటనే ఉన్నతాధికారులు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆరోగ్య కార్యక్రమాల్లో ఉక్కిరిబిక్కిరిగా విధుల్లో నిమగ్నమైన సిబ్బందికి పింఛన్ల పంపిణీ కార్యక్రమాలను అప్పగించడం ఆశ్చర్యంగా ఉందని పేర్కొన్నారు. ఒక వైపు ఇమ్యూనైజేషన్, బిసిజి టీకాల కార్యక్రమం, మరోవైపు 104 ఆరోగ్య శిబిరాలకు హాజరు కావడమే కాకుండా ప్రస్తుతం వ్యాధుల నివారణకు మహిళా ఆరోగ్య సిబ్బంది తలమునకలై విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. ఇలాంటి తరుణంలో సంబంధం లేని పింఛన్ల పంపిణీని అప్పగించడం ఉద్యోగుల్లో ఆందోళన కలిగిస్తోందని చెప్పారు. రెండు రోజులుగా ఎంపిడిఒలు.. ఎఎన్ఎంలకు, ఇతర సిబ్బందికి ఫోన్లు చేసి పింఛన్లు పంపిణీ చేయాలని ఒత్తిడి చేస్తున్నారని ఆందోళన వ్యక్తంచేశారు.

రేపు మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి-విజయనగరం కోట

జూలై 1న మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ టివి గిరి తెలిపారు. ఐటిఐలో ఏదైనా ట్రేడ్‌లో పాసైన వారు, ఇంటర్ డిప్లమో, డిగ్రీ అర్హత ఉన్నవారు ఈ మెగా జాబ్ మేళాలో పాల్గొనవచ్చునని తెలిపారు. జాబ్ మేళాలో టాటా అడ్వాన్స్ సిస్టమ్స్, టివిఎస్ సుందరం ఫాస్ట్నర్స్, డెక్కన్ ఫెర్రో ఎల్లాయిస్, క్యూసివ్ టెక్నాలజీ ప్రైవేట్ లిమిటెడ్, రేడియంట్ ఎలక్ట్రానిక్, వరుణ్ జెసిబి, టెక్ మహేంద్ర, టివిఎస్, జెవై సొల్యూషన్స్, వరుణ్ మోటార్స్, పిట్టి ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ పలు కంపెనీలు పాల్గొని అభ్యర్థులను ఎంపిక చేయనున్నాయని తెలిపారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎస్‌జిఎఫ్ కార్యదర్శిగా కృష్ణంరాజు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జిల్లా స్కూలు గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా కొత్తవలస మండలం దెందేరు జెడ్‌పి హైస్కూలు వ్యాయామ ఉపాధ్యాయులు పి.కృష్ణంరాజు ఎంపికయ్యారు. ఈమేరకు శుక్రవారం జిల్లా విద్యా శాఖ అధికారి ఎన్ ప్రేమ్ కుమార్ ఉత్తర్వులు అందజేశారు. సీనియారిటీ ప్రాతిపదిక ఎంపికైన కృష్ణంరాజు స్వతహాగా జాతీయ స్థాయి క్రీడాకారుడు. వాలీబాల్ జూనియర్స్ విభాగంలో జాతీయ స్థాయిలో ఆడారు. ఎంతోమంది రాష్ట్ర, జాతీయ స్థాయిలో క్రీడాకారులను అందించారు. అన్ని విధాలా మెరిట్ ఆధారంగా స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శిగా ఎంపిక చేసినట్లు డిఇఒ తెలిపారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర వాలీబాల్ అసోసియేషన్ కార్యదర్శి భగవాన్‌దాస్, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సూరిబాబు, కెవిఎన్‌రాజు, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయులు అభినందించారు.

కృష్ణంరాజుకు ధ్రువపత్రం అందిస్తున్న డిఇఒ

భారత న్యాయ సంహిత చట్టం..

డ్రైవర్ల మెడకు ఉరితాడు

సిఐటియు ఆధ్వర్యాన ఆటో కార్మికుల నిరసన

ప్రజాశక్తి-బొబ్బిలి

కేంద్ర ప్రభుత్వం జులై ఒకటి నుంచి అమలు చేయనున్న భారత న్యాయ సంహిత చట్టం.. డ్రైవర్ల మెడకు ఉరితాడు వంటిదని సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు ఆందోళన వ్యక్తంచేశారు. ఐపిసి చట్టానికి బదులు బిఎన్ఎస్ అమలు చేయడానికి వ్యతిరేకంగా పట్టణంలోని చర్చి సెంటర్లో శుక్రవారం సిఐటియు ఆధ్వర్యాన ఆటో కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశంలో మోడీ ప్రభుత్వం నూతనంగా అమలు చేస్తున్న క్రిమినల్ చట్టాలలో రవాణా రంగానికి సంబంధించిన 106(1), 106(2) చట్టాన్ని జులై ఒకటి నుంచి తెస్తున్నారని చెప్పారు. అనుకోకుండా రోడ్డు ప్రమాదాలు జరిగి ఎవరైనా మరణిస్తే డ్రైవర్ తప్పు లేనప్పటికీ కేసు నమోదైతే మూడేళ్ల నుంచి ఏడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుందన్నారు. ప్రమాదాలపై నిపుణుల కమిటీ ఇచ్చిన నివేదికను పరిశీలిస్తే ప్రభుత్వాల నిర్లక్ష్యం వల్ల ప్రమాదాలు జరుగుతున్నట్లు తేలిందన్నారు. రోడ్లు సక్రమంగా లేకపోవడం, ట్రాఫిక్ రూల్స్‌పై అవగాహన కల్పించకపోవడం వంటి కారణాలు ఉన్నాయని చెప్పారు. వాహనాల తయారీ కంపెనీలకు లాభాలు చేకూర్చేందుకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన లేనివారికి కూడా నూతన వాహనాలను అమ్ముతున్నారని విమర్శించారు. హైవేల పక్కన మద్యం దుకాణాలు ఏర్పాటు చేయడం చట్ట విరుద్ధమైనా రాష్ట్ర, జాతీయ రహదారుల పక్కనే మద్యం దుకాణాలు ఏర్పాటు చేస్తున్నారన్నారు. భారత న్యాయ సంహిత చట్టాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ జులై 1న నిరసనలు, 10న తహశీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేయనున్నట్లు చెప్పారు. మోడీ తెచ్చిన క్రిమినల్ చట్టాలను ఆపాలని తమిళనాడు, బెంగాల్, కేరళ ప్రభుత్వాలు కేంద్రానికి లేఖ రాశాయన్నారు. రాష్ట్రంలోని ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం కూడా కేంద్రానికి లేఖ రాయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే రవాణా రంగం సమ్మె చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు ఆల్తి కృష్ణ, మోహనరావు, రాంబాబు, రామచంద్రరావు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు, సిఐటియు నాయకులు

భూసేకరణ చెల్లింపులు వేగవంతం

కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బి.ఆర్. అంబేద్కర్

ప్రజాశక్తి-విజయనగరం కోట

జిల్లాలో పలు ప్రాజెక్టులకు జరుగుతున్న భూ సేకరణ పనులు వేగంగా జరగాలని, చెల్లింపులు కూడా సత్వరమే జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా.బి.ఆర్. అంబేద్కర్ తెలిపారు. శుక్రవారం తన ఛాంబర్ లో భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులు, జాతీయ రహదారులు, రైల్వే పనులు, ఇరిగేషన్ ప్రాజెక్టుల పనుల పై ఆయా అధికారులతో సమీక్షించారు. భోగాపురం ఎయిర్ పోర్ట్ పనులకు సంబంధించి మ్యాప్ లను పరిశీలించారు. ఆర్ అండ్ ఆర్ అంశాల పై ఆరా తీసారు. ఆర్‌డిఒ సూర్యకళ మాట్లాడుతూ రన్ వే, అప్రోచ్ రోడ్ పనులు పురోభివృద్ధిలో ఉన్నాయని, ఆర్ అండ్ ఆర్ సమస్యలేమీ లేవని వివరించారు. జాతీయ రహదారులకు సంబంధించి ప్యాకేజి 1 లో మ్యుటేషన్ సమస్యలు ఉన్నాయని, 3 లో రోడ్ పై విగ్రహాలు తొలగించవలసి ఉందని, చెల్లింపులు కొంత మేరకు పెండింగ్ ఉన్నాయని డిప్యూటీ కలెక్టర్లు తెలిపారు. రైల్వేస్ కు సంబంధించి భూ సేకరణ జరగవలసి ఉందని, పెదమానాపురం వద్ద గ్రామ కంఠం ఉందని, నోటిఫికేషన్ జారీ చేయవలసి ఉందని ఆర్‌డిఒ సూర్యకళ తెలుపగా వెంటనే నోటిఫికేషన్ జారీ చేయాలని కలెక్టర్ సూచించారు. పురిటిపెంట గ్రామం వద్ద చెల్లింపులు పెండింగ్ ఉన్నాయని, కోమటిపల్లి వద్ద భూ సేకరణ చేయవలసి ఉందని రైల్వే అధికారులు కలెక్టర్ దృష్టి కి తెచ్చారు. రైల్వే వారికి అవసరమైన భూ సేకరణ తక్షణమే చేయాలని, చెల్లింపులకు అవసరమగు నిధులను కూడా మంజూరుకు లేఖ రాయాలని కలెకర్ తెలిపారు.

ఇరిగేషన్ ప్రాజెక్టులకు భూసేకరణ కోసం నిధులు లేవని, పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయని ఇరిగేషన్ అధికారులు తెలిపారు. పెండింగ్ వివరాల తో నోట్ సమర్పించాలని, ఇరిగేషన్ సెక్రటరీ కు లేఖ రాస్తామని తెలిపారు. తారకరక తీర్థ సాగర్, తోటపల్లి, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి పనులకు నిధులు లేక ఆగిపోయాయని , కొన్ని చోట్ల భూ సమస్యలు కూడా ఉన్నాయని కలెక్టర్ దృష్టికి అధికారులు తీసుకురాగా , జెసి, ఆర్‌డిఒ రైతులతో మాట్లాడి భూ సమస్యలను వెంటనే పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో జెసి కార్తీక్, డిఆర్‌ఒ అనిత, ఆర్‌డిఒ సూర్యకళ, డిప్యూటీ కలెక్టర్లు ప్రమీల, మురళీ, జోసెఫ్ , జిఎంఆర్ సంస్థ నుండి రామ రాజు, రైల్వే అధికారులు, జాతీయ రహదారుల అధికారులు, ఇరిగేషన్ ఇంజినీర్లు, ఆయా మండల తహశీల్దార్లు పాల్గొన్నారు

ఇవిఎం గోదాముల తనిఖీ

నెల్లిమర్ల : స్థానికంగా ఇవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శుక్రవారం తనిఖీ చేశారు. సిసి కెమేరాలు, గోడౌన్లకు వేసిన తాళాలు, సీళ్లను పరిశీలించారు. అక్కడి భద్రతా ఏర్పాట్లను సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. ఇవిఎం గోదాములకు ఇరువైపులా వర్షపు నీరు నిల్వ ఉండకుండా చూడాలని ఇంజినీరింగ్, మున్సిపల్ అధికారులను కలెక్టర్ అంబేద్కర్ ఆదేశించారు. ఇరువైపులా చెరువుల్లా మారిన పల్లపు ప్రదేశాలను కలెక్టర్ పరిశీలించారు. ఆ నీరు బయటకు పోయే మార్గాలపై ఆరా తీశారు. లోతట్టు ప్రాంతాలను మట్టితో కప్పివేయాలని, నీరు పోవడానికి పైప్‌లైన్లు వేయాలని, లేదా ఇతర ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. దీనిపై సమగ్ర ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు.ఆయన వెంట డిఆర్‌ఒ ఎస్‌డి అనిత, ఆర్‌డిఒ ఎంవి సూర్యకళ, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఇ బి.ఉమాశంకర్, ఇరిగేషన్ ఇఇ ఎం.సీతారామనాయుడు, మున్సిపల్ కమిషనర్ బాలాజీ ప్రసాద్, ఎలక్షన్ సూపరింటెండెంట్ ప్రభాకర్, తాహశీల్దార్ రామరాజు, డిప్యూటీ తాహశీల్దార్ మూర్తి, తదితరులు పాల్గొన్నారు.

ఫ్లైఓవర్ నిర్మించండి

కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌కు ఎమ్‌పి కలిశెట్టి వినతి

ప్రజాశక్తి-విజయనగరం కోట

పార్వతీపురం మన్యం జిల్లాలో అంతర్ రాష్ట్ర రోడ్డు మార్గంలో పార్వతీపురం-కొమరాడ మధ్య ఫ్లై ఓవర్లు నిర్మించాలని కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌ను విజయనగరం ఎంపి కలిశెట్టి అప్పలనాయుడు కోరారు. ఈమేరకు శుక్రవారం కేంద్రమంత్రి సెలవులో ఉండడంతో ఆయన ఒఎస్‌డి వేద ప్రకాష్‌కు వినతి అందజేశారు. పార్వతీపురం – కొమరాడ మధ్య రాయగడ రైల్వే లైన్ ఉందని, ఇటీవల థర్డ్‌లైన్ కూడా పూర్తయ్యిందని తెలిపారు. కొమరాడ మండలం అర్తాం, కోటిపాం గ్రామాల మధ్య దూరం ఐదు కిలోమీటర్ల పరిధిలో 3రైల్ క్రాసింగ్‌లు ఉన్నాయని, ప్రస్తుతం మూడో లైన్ వచ్చిన తరువాత ప్రతీ ఐదు నిముషాలకు గేటు పడుతూనే ఉందని, దీంతో ఈ మార్గంలో ప్రయాణం తీవ్ర ఇబ్బందికరంగా మారిందని తెలిపారు. విశాఖ పోర్టు నుంచి ఒడిశా లోని దమంజోడి, రాయగడ, తదితర ప్రాంతాల పరిశ్రమలకు అల్యూమినియం తదితర ముడిసరుకు లారీల్లో వెళ్తున్నందున ఒక వైపు ప్రయాణికులు, మరోవైపు రవాణా ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మన్యం, విజయనగరం, ఒడిశా రాయగడ, కోరాపుట్ జిల్లాల రోగులకు చెందిన అంబులెన్సులు ఈ మార్గం గుండా వస్తుంటాయని, గేట్లు పడి సమయానికి ఆసుపత్రికి చేరుకోలేక ప్రాణాపాయానికి గురవుతున్నారని తెలిపారు. మూడు రైల్ క్రాసింగ్‌ల అడ్డు తొలగేందుకు ఒక్క దగ్గర ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మించాలని కోరారు.

ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024

ఎంట్రీలకు ఆహ్వానం

ప్రియమైన మిత్రులారా!

ప్రజాశక్తి దిన పత్రిక వ్యవస్థాపక సంపాదకులు మోటూరు హనుమంతరావు స్మృత్యర్థం పాత్రికేయ రంగంలో ఉత్తమ కృషి చేసిన జర్నలిస్టులను సత్కరించేందుకు ఎంహెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డును నెలకొల్పి రెండు దశాబ్దాలు దాటింది. కోవిడ్ కాలం మినహా ప్రతి యేటా క్రమం తప్పకుండా ఈ పురస్కారాన్ని ప్రజాశక్తి సాహితీ సంస్థ అందజేస్తూ వస్తున్నది. 2024 సంవత్సరానికి ఉత్తమ జర్నలిస్టు అవార్డు కోసం ఎంట్రీలను ఆహ్వానిస్తున్నది. సీనియర్ పాత్రికేయులు తెలకపల్లి రవి అధ్యక్షతన నాగార్జున యూనివర్సిటీ జర్నలిజం విభాగం అధిపతి ప్రొఫెసర్ జి అనిత, సీనియర్ జర్నలిస్టు నల్లి ధర్మారావుతో కూడిన త్రిసభ్య కమిటీ ఈ ఏడాది అవార్డు కోసం ఏదేని అంశంపై మానవాసక్తికర వార్తా కథనాలను ఎంట్రీలుగా ఆహ్వానించాలని నిర్ణయించింది. 2023 మే 1నుంచి 2024 జూన్ 18వ తేదీ వరకు తెలుగు దిన పత్రికల్లో ప్రచురితమైన మానవాసక్తికర కథనాలను మాత్రమే పంపాలి. ఉభయ తెలుగు రాష్ట్రాలకు చెందిన జర్నలిస్టులు ఎంట్రీలు పంపవచ్చు. ఎంట్రీతోపాటు ఇది నా సొంత రచన, ఎవరినీ అనుకరించినది కాదు అని స్వీయ ధ్రువీకరణ పత్రం జతచేసి పంపాలి. ఒక వ్యక్తి రెండు కథనాలకు మించి పంపకూడదు. తమ దృష్టికి వచ్చిన ఇతరుల కథనాలను ఎవరైనా సూచించవచ్చు కూడా. ప్రజాశక్తి సంస్థ జర్నలిస్టులు ఈ విభాగంలో పంపనవసరం లేదు. ఎంట్రీలు 2024 జులై 18 నాటికల్లా మాకు అందేట్లు చూడాలి. కవర్‌పై 'ఎం హెచ్ స్మారక ఉత్తమ జర్నలిస్టు అవార్డు-2024 కోసం' అని స్పష్టంగా పేర్కొనాలి. ఇ-మెయిల్ ద్వారా కూడా పంపవచ్చు. అవార్డు విజేతకు 2024 ఆగస్టులో జరిగే ఎంహెచ్ స్మారకోపన్యాస సభలో జ్ఞాపిక, రూ.10 వేలు నగదు ఇచ్చి సముచిత రీతిలో సత్కరించడం జరుగుతుంది.

ఎంట్రీలు పంపాల్సిన చిరునామా

ప్రజాశక్తి సాహితీ సంస్థ,
ప్రజాశక్తి భవనం, అమరారెడ్డి కాలనీ,
తాడేపల్లి, గుంటూరు జిల్లా,
పిన్‌కోడ్-522501, ఇ మెయిల్
అడ్రస్: psmhaward@gmail.com

కార్యదర్శి

(ఎంవిఎస్ శర్మ)
ప్రజాశక్తి సాహితీ సంస్థ

సజావుగా పింఛన్ల పంపిణీ

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

నగరంలో జూలై ఒకటో తేదిన పెన్షన్ల పంపిణీ సజావుగా జరిగేలా చర్యలు చేపట్టామని నగరపాలక సంస్థ సహాయ కమిషనర్ సిహెచ్ తిరుమలరావు అన్నారు. నగర పాలక సంస్థ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ పింఛన్ల పంపిణీ 1వ తేదీనే పూర్తి చేయాలని, ఎక్కడైనా మిగిలి ఉంటె 2వ తేదీ నాటికి శత శాతం పంపిణీ జరిగేలా చూడాలని సచివాలయ సిబ్బందికి ఆదేశించారు. పింఛను పంపిణీ కేవలం ప్రభుత్వ ఉద్యోగులు మాత్రమే చేయాలని, తాత్కాలిక ఉద్యోగులు పాల్గొనరాదని స్పష్టం చేసారు. ఇందుకోసం వెంటనే క్లస్టర్ వారీగా సిబ్బంది మాపింగ్ చేశామని, 50 నుండి 60 మందిని ఒక క్లస్టర్‌లో చేర్చామని చెప్పారు. నగరంలో మొత్తం పింఛను దారులు 23,303 మందికి 16 కోట్ల 36 వేల రూపాయల మేర అందించనున్నట్లు చెప్పారు.

ప్లాస్టిక్ అమ్మకాలపై కొరడా

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్లాస్టిక్ అమ్మకాలపై శుక్రవారం మున్సిపల్ అధికారులు కొరడా ఝుళిపించారు. మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వినియోగంపై నిషేధం ఉన్నప్పటికీ కొంతమంది వ్యాపారులు రహస్యంగా అమ్మకాలు జరుపుతున్నారు. కమిషనర్ ఎల్.రామలక్ష్మి ఆదేశాలు మేరకు శానిటరీ ఇన్స్పెక్టర్ శివ, సిబ్బంది షాపులపై దాడి చేసి ప్లాస్టిక్ గ్లాసులను సీజ్ చేశారు. వ్యాపారులకు జరిమానా విధించారు. ప్లాస్టిక్ గ్లాసులు, సంచులు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని కమిషనర్ రామలక్ష్మి హెచ్చరించారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి-రేగిడి

విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అధిక ధరలకు విక్రయిస్తే దుకాణాలను సీజ్ చేస్తామని ఎఒ గిరడ మురళీకృష్ణ హెచ్చరించారు. మండలంలో ఉణుకూరు శ్రీలక్ష్మీ గణపతి ట్రేడర్స్, బూరాడ శ్రీ రామ ట్రేడర్స్, జోడుబండల సెంటర్లో శుక్రవారం విత్తనాలు, ఎరువుల దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. విత్తనాలు, ఎరువులు స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. రేట్లు తప్పనిసరిగా బోర్డుపై ఉండాలన్నారు.. అమ్మకాలు చేపట్టిన విత్తనాలు, ఎరువులకు తప్పనిసరిగా రసీదు రైతులకు అందజేయాలన్నారు.

పశువులు, గొర్రెల పెంపకందారులతో మాట్లాడుతున్న డిఎఫ్ఒ వెంకటేష్

మొక్కలు నాటిన అటవీశాఖ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

అటవీ శాఖ ఆధ్వర్యంలో 15 వేల మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం దమరసింగి రిజర్వ్ ఫారెస్ట్ విభాగంలో కొత్తపేట వద్ద అటవీ శాఖ ఆధ్వర్యంలో 50 ఎకరాల్లో 15 వేల మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అటవీ శాఖ జిల్లా అధికారి ఎస్.వెంకటేష్ మొక్కలు నాటే కార్యక్రమాన్ని పరిశీలించారు. మొక్కలు కాపాడుకొనే బాధ్యత అందరిపై ఉందని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ బి.అప్పలరాజు, డివిజన్ రేంజ్ ఆఫీసర్ కె.వి.ఎస్.రాజు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే బేబినాయనను సత్కరిస్తున్న జనసేన నాయకులు

బేబినాయనను కలిసిన జనసేన నాయకులు

ప్రజాశక్తి-బొబ్బిలి

ఎమ్మెల్యే బేబినాయనను జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి గిరడ అప్పలస్వామి, పెద్దింటి మనోజ్ కుమార్, లంక వాసు మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించారు. నియోజకవర్గంలో సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని బేబినాయనను కోరారు. టిడిపి ఎస్‌సి సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రావాడ సీతారాం, సర్పంచ్ రౌతు శ్రీనివాసరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు బేబినాయనను కలిసి శుభాకాంక్షలు చెప్పారు.

జానపద కళలను కాపాడుకోవాలి

ప్రజాశక్తి-గంట్యాడ

జానపద కళలను కాపాడుకోవాలని జానపద కళా పీఠం అధ్యక్షులు, నవ చైతన్య నాట్య కళామండలి అధ్యక్షులు బద్రి కూర్మారావు, ఎస్.చిన్నారెడ్డి అన్నారు. మండలంలోని పెదవేమలి గ్రామంలో నారి తల్లమ్మ గుడి వద్ద పొడుపు రెడ్డి శంకర్రావు రమణ ఏర్పాటు చేసిన చెక్కభజన, కోలాటం శిక్షణ కార్యక్రమంలో వారు మాట్లాడారు. జానపద కళలను కాపాడుకొని భావితరాలకు అందించాలన్నారు. సమాజాభివృద్ధికి ఇవి దోహద పడతాయని చెప్పారు. కార్యక్రమములో జానపద కళాకారులు పద్మావతి, సాయికుమార్, పొట్ట తౌడు, తదితరులు పాల్గొన్నారు.

గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందాం

ప్రజాశక్తి - పూసపాటిరేగ

గ్రామాభివృద్ధే ధ్యేయంగా పనిచేద్దామని రెల్లివలస సర్పంచ్ ఇజ్జురౌతు అప్పలరాజు అన్నారు. శుక్రవారం మండలలోని రెల్లివలసలో సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. గ్రామాభివృద్ధికి సంబంధించి 33 తీర్మానాలు ఆమోదించారు. సమావేశంలో వార్డు మెంబర్లు, కార్యదర్శి త్రినాదరావు పాల్గొన్నారు.

30న విద్యుత్తు బిల్లులు చెల్లించవచ్చు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యుత్ వినియోగదారులు ఈనెల 30న ఆదివారం విద్యుత్తు బిల్లులు చెల్లించేందుకు వీలుగా రెవెన్యూ కార్యాలయాలు తెరిచి ఉంటాయని ట్రాన్స్‌కో ఇఇ పి.హరి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సౌకర్యాన్ని వినియోగదారులందరూ ఉపయోగించుకుంటారని తెలిపారు.

రైతు సాధికారతే ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

రైతు సాధికారతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని ఎమ్మెల్యే లోకం నాగ మాధవి అన్నారు. శుక్రవారం వల్లూరు గ్రామంలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రాయితీపై వరి విత్తనాలను ఎమ్మెల్యే పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వ్యవసాయ రంగం నిర్లక్ష్యానికి గురై రైతులు ఇబ్బందులు పడ్డారని తెలిపారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం రైతులను అన్నివిధాలా ఆదుకొని అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. రైతులు సేంద్రియ వ్యవసాయంపై దృష్టిసారించి ఆదాయాన్ని పెంచుకోవాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యేను గ్రామస్తులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి అంబళ్ళ సుధారాణి, టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కర్రోతు బంగార్రాజు, రాష్ట్ర పరిశీలకులు సువ్వాడ రవి శేఖర్, మాజీ ఎంపిపి సువ్వాడ వనజాక్షి, టిడిపి మండల అధ్యక్షులు కడగల ఆనంద్ కుమార్, జిల్లా అధికార ప్రతినిధి గేదెల రాజారావు, బిజెపి నాయకులు బూర్లే శ్రీధర్, సర్పంచ్ పంచాది జయలక్ష్మి, ఎంపిటిసి లెంక నాగేశ్వరి, నాయకులు పంచాది జగన్నాథం, లెంక సన్యాసి రావు, తహశీల్దారు డి.ధర్మరాజు, ఎంపిడిఒ జి.రామారావు, ఎఒ ఎం.పూర్ణిమ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రైతులకు విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే లోకం నాగ మాధవి

8వ రోజుకు జిందాల్ కార్మికుల దీక్షలు

దీక్షలు చేస్తున్న కార్మికులు, కార్మిక సంఘాల నాయకులు

ప్రజాశక్తి-కొత్తవలస

జిందాల్ పరిశ్రమ వద్ద కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారం ఎనిమిదో రోజుకు చేరాయి. జిందాల్ పరిశ్రమ యాజమాన్యం అక్రమ లాకౌట్‌ను ఎత్తేసి, బేషరతుగా కార్మికులకు ఉపాధి కల్పించాలని ఆందోళన వ్యక్తం చేశారు. 43 రోజులు గడిచినా యాజమాన్యం స్పందించక పోవడంపై ఆగ్రహం వ్యక్తంచేశారు. జిందాల్ జెఎసి నాయకులు నమ్మి చినబాబు, గాడి అప్పారావు (సిఐటియు), పిల్లా అప్పలరాజు (టిఎన్‌టియుసి) నాయకత్వంలో కార్మికులు దీక్ష చేపట్టారు.

రోజువారీ మార్కెట్ వేలం

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని బొద్దాం, వల్లంపూడి గ్రామాల్లో ఎంపిడిఒ ఉమ ఆధ్వర్యాన రోజువారీ మార్కెట్ వేలం నిర్వహించారు. బొద్దాంలో రూ.1.46 లక్షలకు వేలం ఖరారైంది. వల్లంపూడి గ్రామంలో 9 నెలలకు గాను రూ.8 వేలకు పి.స్వామినాయుడు వేలం పాడారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎర్ర రామ సత్యవతి, ఉప సర్పంచ్ రుద్ర వెంకట రావు, పంచాయతీ కార్యదర్శులు పద్మ, వెంకటరమణ పాల్గొన్నారు.

ఆశీల వేలం వాయిదా

ప్రజాశక్తి-గజపతినగరం

గజపతినగరం గ్రామ పంచాయతీ ఆశీల వేలం శుక్రవారం స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద సర్పంచ్ నరవ కొండమ్మ, ఇఒపిఆర్‌డి టి.జనార్దన్ రావు, కార్యదర్శి ఎం.రమణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ వేలంలో సంచాన పైడిరాజు, గంటేడ అప్పలనాయుడు మాత్రమే పాల్గొని రూ.63 వేలకు పాడారు. ప్రభుత్వం నిర్ణయించిన రూ.3,08,660 రాకపోవడంతో జులై మూడో తేదికి వేలం వాయిదా వేశారు..

పారాది వంతెన పనులు ప్రారంభించాలి

బొబ్బిలి : పారాది వంతెన పనులు ప్రారంభించాలని కొప్పల వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు పోల జగన్ ఒక ప్రకటనలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పారాది వంతెన పాడైపోవడంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఇదే వంతెన పైనుంచి బొబ్బిలి, పార్వతీపురం, కురుపాం, సాలూరు ఎమ్మెల్యేలు రాకపోకలు చేస్తున్నా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నూతన వంతెన పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు.

ఐటిఐ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బొబ్బిలి

ఐటిఐ ప్రవేశాలకు శనివారం నుంచి జులై 24 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వ ఐటిఐ ప్రిన్సిపల్ జివి రమణరావు ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులు itu.ap.gov.in వెబ్సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఆన్లైన్‌లో పదో తరగతి సర్టిఫికెట్, స్టడీ, ఆధార్ అప్లోడ్ చేయాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు జులై 27న బొబ్బిలి ప్రభుత్వ ఐటిఐలో కౌన్సెలింగ్ ఉంటుందని తెలిపారు.

పెద్దలు పనికి.. పిల్లలు బడికి

ప్రజాశక్తి-వంగర

నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా అరసాడలో ఎంఇఒ వై.దుర్గారావు ఆధ్వర్యంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. పెద్దలు పనికి పోవాలి, పిల్లలు బడికి పోవాలి, మన ఊరు బడి.. భవితకు గుడి.. అంటూ ప్లకార్డులు పట్టుకొని నినాదాలు చేశారు. అనంతరం అనంతరం ప్రాథమిక పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని ఎంఇఒ రుచిచూసి సంతృప్తి చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు కె.జగదీశ్వరి, ఎం.గోవిందరావు, సిఆర్ఎంటి ఎం.గణపతి పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

ఉద్యోగ జీవితం సంతృప్తినిచ్చింది

ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ ఎం.ప్రభాకరరావు

ప్రజాశక్తి-విజయనగరం

పని చేసే ప్రాంతంలో ప్రజలతో మంచి సంబంధాలు కలిగి, వారితో మమేకమై పని చేయడం వల్ల మంచి గుర్తింపు రావడంతోపాటు తనకు ఉద్యోగ జీవితం ఎంతో సంతృప్తి ఇచ్చిందని ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్ (తహశీల్దార్) ఎం.ప్రభాకరరావు తెలిపారు. పుట్టి పెరిగిన ప్రాంతంలోనే ఉద్యోగ జీవితం ప్రారంభించి, ఇక్కడే ఉద్యోగ విరమణ చేయడం తీపి గుర్తుగా మిగిలిపోతుందన్నారు. విజయనగరం తహశీల్దార్‌గా పనిచేసిన కాలంలో అప్పటి ప్రభుత్వం ప్రాధాన్యత కార్యక్రమమైన ఇళ్ల పట్టాలకు సంబంధించి గుంకలాం, కొండకరకాం, సారిక ప్రాంతాల్లో సుమారు 20 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇవ్వడం తన ఉద్యోగ జీవితంలో మైలురాయి మిగులుతుందని చెప్పారు.

సుమారు 38 ఏళ్ల ఉద్యోగ జీవితం విజయవంతంగా పూర్తి చేయగలిగానంటే అందరితో కలిసి మెలిసి పనిచేయడం, ప్రతిఒక్కరితో స్నేహ పూర్వక సంబంధాలు కలిగి ఉండటమే కారణమన్నారు. ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే మరోవైపు రెవెన్యూ ఉద్యోగ సంఘంలో కూడా క్రియాశీలంగా వ్యవహరించానని వెల్లడించారు. ఈ నెలాఖరికి ఉద్యోగ విరమణ చేస్తున్న ఆయన ప్రజాశక్తితో తన అనుభవాలను పంచుకొన్నారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

కుటుంబ నేపథ్యం.. 1962లో విజయనగరంలో జన్మించాను. నాన్న టెలికాం విభాగంలో ఉద్యోగి. అమ్మ గృహిణి. అన్నయ్య సిసిఎల్‌ఎల్‌లో ఉద్యోగం చేస్తూ రిటైర్డ్ అయ్యారు. ఒక సోదరి ఉన్నారు. 1990లో శైలజతో నా వివాహమైంది. కుమార్తె నిహారిక ఉన్నారు.

విద్యాభ్యాసం.. విజయనగరంలోని మున్సిపల్ పాఠశాలలో ప్రాథమిక, హైస్కూల్ విద్య సాగింది. ఇంటర్ ఎంఆర్ కాలేజీ, ఐటిఐ మాన్సాస్ ఐటిఐలో పూర్తిచేశాను. డిగ్రీ, పీజీ ప్రయివేట్‌గా ఆంధ్రా యూనివర్సిటీలో పూర్తి చేశాను.

ఉద్యోగ జీవితం .. 1986లో బొండపల్లి మండలం తహశీల్దార్ కార్యాలయంలో టైపిస్ట్‌గా ఉద్యోగ జీవితం ప్రారంభమైంది. ఒకేసారి రెండు ఉద్యోగాలు వచ్చాయి. స్టీల్‌ప్లాంట్‌లో కొలువు సాధించినా, సేవ చేసే మార్గం ఉంటుందని రెవెన్యూలో ఉద్యోగం వైపు వెళ్లాను. తరువాత తెర్లాం, నెల్లిమర్ల, కలెక్టర్, డిఎస్‌ఒ కార్యాలయాల్లో 2005 వరకు టైపిస్టుగా పనిచేశాను. అనంతరం ఉద్యోగోన్నతిపై మండల ఆర్‌ఐగా జామి మండలంలో 2008 వరకు పనిచేసి, బదిలీపై కలెక్టరేట్‌లో సీనియర్ అసిస్టెంట్‌గా చేరాను. 2011 వరకు ఇక్కడ పని చేసి ఉద్యోగోన్నతిపై డిప్యూటీ తహశీల్దార్‌గా డెంకాడ మండలానికి వెళ్లాను. 2014 వరకు డెంకాడలో పనిచేసి బదిలీపై విజయనగరం మండలానికి వచ్చి 2019 వరకు పనిచేశాను. ఇక్కడ పనిచేస్తుండగా తహశీల్దార్‌గా ఉద్యోగోన్నతిపై విజయనగరం కెఆర్‌ఆర్‌సికి వెళ్లాను. 2020లో విజయనగరం తహశీల్దార్‌గా ఎఫ్‌ఎసిగా, తరువాత రెగ్యులర్‌గా తహశీల్దార్‌గా 2022 వరకు పనిచేశాను. 2022 ఫిబ్రవరి నుంచి విజయనగరం ఆర్‌డిఒ కార్యాలయ ఎఒగా విధులు నిర్వర్తించాను. ఈ ఏడాది జూన్ నుంచి ఎలక్షన్ సెల్ సూపరింటెండెంట్‌గా విధులు నిర్వహిస్తున్నాను.

గుర్తుండిపోయే అంశాలు.. విజయనగరం తహశీల్దార్‌గా నేను పనిచేసిన కాలంలో పేదలందరికీ ఇళ్ల పట్టాలు పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. విజయనగరం మండలం పరిధిలో గుంకలాం, కొండకరకాం, సారిక గ్రామాల పరిధిలో సుమారు 20 వేల మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేశాం. ఈ కార్యక్రమం నా జీవితంలో మరిచిపోలేని సంఘటన. విజయనగరంలో పని చేసిన కాలంలో ప్రోటోకాల్ చూడటంతోపాటు వివిధ కార్యక్రమాలను విజయవంతంగా నిర్వహించడం మర్చిపోలేనివి. నా ఉద్యోగ జీవితం విజయవంతంగా పూర్తి చేయడానికి సహకరించిన అధికారులకు, సహచర ఉద్యోగులకు, ఇతర సిబ్బందికి కృతజ్ఞతలు.

సిబిఎం పాఠశాల ఆస్తులను కాపాడాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

సిబిఎం పాఠశాల ఆస్తులను కాపాడాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పి.శంకరరావు డిమాండ్ చేశారు. పట్టణానికి చెందిన ఒక వైద్యునికి అక్రమంగా విక్రయించిన సిబిఎం పాఠశాల సిబ్బంది క్వార్టర్స్‌ను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సిబిఎం పాఠశాల ఎయిడెడ్ యాజమాన్యం ఆధ్వర్యంలో నడుస్తోందన్నారు. కొన్నేళ్ల క్రితం పాఠశాల సిబ్బంది క్వార్టర్స్, బాలికల వసతి గృహం స్థలాన్ని అక్రమ మార్గంలో అమ్మివేసినట్లు నూతనంగా బాధ్యతలు స్వీకరించిన కరస్పాండెంట్ విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశంలో చెప్పారన్నారు. ప్రభుత్వ అనుమతి లేకుండా ఎయిడెడ్ పాఠశాల స్థలాలను ఎలా విక్రయిస్తారని ప్రశ్నించారు. సిబిఎం ఆస్తులను అమ్మివారిపైన, కొన్నవారిపైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అమ్మివేసిన ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని, అవి అన్యాకాంతం కాకుండా కాపాడాలని కోరారు. పట్టణంలో ఉన్న సిబిఎం పాఠశాల ఆవరణలో జూనియర్, డిగ్రీ కళాశాలను ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి ఎస్.గోపాలం, బాడంగి మండల కార్యదర్శి సురేష్, యుగంధర్ పాల్గొన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న లోకం ప్రసాద్

చిన్న తరహా పరిశ్రమలతోనే అధిక లాభాలు

ప్రజాశక్తి-భోగాపురం

నైపుణ్యత ఆధారంగా చిన్న తరహా పరిశ్రమలు స్థాపిస్తే ఎక్కువగా విజయం సాధించవచ్చని మిరాకిల్ సాఫ్ట్‌వేర్ సంస్థ సిఇఒ, జనసేన నాయకులు లోకం ప్రసాద్ అన్నారు. భోగాపురంలోని జనసేన పార్టీ కార్యాలయంలో ఎమ్మెల్యే లోకం మాధవి ఆధ్వర్యంలో పరిశ్రమల స్థాపనకు ఔత్సాహిక యువకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్న చిన్న పరిశ్రమల ద్వారా లాభాలు పొందవచ్చన్నారు. ఈ పరిశ్రమలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీతో రుణాలు అందిస్తాయని తెలిపారు. దీనిపై అవగాహన సదస్సులు ఏర్పాటుచేస్తామన్నారు. ఎవరైనా పరిశ్రమలు ఏర్పాటు చేయాలనుకుంటే వారి పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు పల్లంట్ల జగదీష్, పళ్ల రాంబాబు పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

ప్రజాశక్తి-నెల్లిమర్ల

వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపిపి అంబళ్ల సుధారాణి సూచించారు. శుక్రవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ జి.రామారావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు, వైద్య సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య పనులు నిర్వహించి మురుగునీటి నిల్వ కాకుండా చూడాలన్నారు. తాగునీటి పథకాలు ఎప్పటికప్పుడు క్లోరినేషన్ చేయాలన్నారు. వైద్య సిబ్బంది ఇంటింటికి వెళ్లి జ్వరాల బారిన పడిన వారిని గుర్తించి తగు వైద్య సేవలు అందించాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణ, తాగునీరు సరఫరాలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఎఎంసి మాజీ చైర్మన్ అంబళ్ల శ్రీరాములు నాయుడు, ఇఒపిఆర్‌డి కె.సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.

పోలవరం.. ఉత్తరాంధ్రకు వరం

మాజీ ఎమ్మెల్యే గద్దె

ప్రజాశక్తి-చీపురుపల్లి

పోలవరం ప్రాజెక్టు ఉత్తరాంధ్రకు వరమని మాజీ ఎమ్మెల్యే గద్దె బాబూరావు అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలవరం పూర్తిచేస్తే సృజల స్రవంతి ద్వారా ఉత్తరాంధ్రలో సుమారు ఎనిమిది లక్షల ఎకరాలకు సాగునీరు అందుతుందన్నారు. విశాఖపట్నం, విజయనగరం, శ్రీకాకుళం ఉమ్మడి జిల్లాల్లో పూర్తి స్థాయి తాగునీరు అందించవచ్చని చెప్పారు. వలసలను అరికట్టడంతో పాటు సన్న, చిన్నకారు రైతులు, కౌలురైతుల జీవన ప్రమాణాలు మెరుగు పడతాయని చెప్పారు. పోలవరం, అమరావతి నిర్మాణాలే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు సాగుతోందని తెలిపారు. డిసిసిబి, డిసిఎంఎస్‌లకు తక్షణమే ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఆర్‌ఇసిఎస్‌లో నకిలీ సర్టిఫికెట్లతో ఉద్యోగాలలో చేరిన వారిని తొలగించాలని అధికారులను కోరారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య

ప్రజాశక్తి-నెల్లిమర్ల

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్య, భోజనం అందించాలని జిల్లా గిరిజన సంక్షేమ శాఖ అధికారి బోని రామానందం సూచించారు. శుక్రవారం ఆయన స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను ఆకస్మిక తనిఖీ చేశారు. విద్యార్థులను బోధన, భోజనం వివరాలు అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో స్టాక్ పరిశీలించి, మౌలిక వసతులపై ఆరాతీశారు. పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించడానికి కృషి చేయాలని సూచించారు. పాఠశాలలో 90 శాతం విద్యార్థులు చేరడం మంచి పరిణామమన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం కర్రి సూర్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల సందర్శన

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని నీలకంఠ రాజపుర అగ్రహారం, సోంపురం, కుంపల్లి గ్రామాల్లోని ప్రాథమిక పాఠశాలలను ఎంఇఒలు జగదీశ్వరరావు, బాల భాస్కరరావు శుక్రవారం పరిశీలించారు. విద్యార్థుల నోట్ పుస్తకాలు, పాఠశాల రికార్డులు, విద్యార్థులకు ఇస్తున్న మెనూ పరిశీలించారు.



విద్యార్థుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న ఎంఇఒ

మంచి మనసు చాటుకున్న తాతినాయుడు

పుస్తకాలు, స్వీట్లు అందజేస్తున్న తాతినాయుడు

ప్రజాశక్తి-సంతకవిటి

మండలంలోని గొల్లవలస పంచాయతీ ఎంఆర్ అగ్రహారానికి చెందిన టిడిపి నాయకులు పైల తాతినాయుడు మంచి మనసు చాటుకున్నారు. రాజాంలోని చెవిటి,మూగ, మానసిక వికలాంగుల పాఠశాలలో శుక్రవారం విద్యార్థులకు పుస్తకాలు, స్వీట్లు, పండ్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఇప్పటి నుంచే ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకొని దాన్ని సాధించేందుకు ముందుకు సాగాలని సూచించారు. ప్రతి విద్యార్థికి ఏదో ఒక దాంట్లో నైపుణ్యం ఉంటుందని, దాన్ని ఉపాధ్యాయులు గుర్తించి పిల్లలను తీర్చిదిద్దాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మన్నేన రమేష్, జి.జనార్ధన్, బవిరి శ్రీనివాసరావు, కారు సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

భార్య హత్యాయత్నం కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలు

ప్రజాశక్తి-బాడంగి

భార్య హత్యాయత్నం కేసులో ముద్దాయికి మూడేళ్ల జైలుశిక్ష, రూ.10 వేలు జరిమానా విధిస్తూ కోర్టు తీర్పునిచ్చింది. మండలంలోని గజరాయునివలస గ్రామంలో చోటుచేసుకున్న సంఘటనకు సంబంధించి మూడేళ్ల తరువాత కోర్టు తీర్పునిచ్చింది. ఎస్ఐ జయంతి కథనం ప్రకారం.. గజరాయునివలస గ్రామానికి చెందిన గొండేల సూరిబాబు బొబ్బిలిలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తుంటాడు. ఇరువురి మధ్య మనస్పర్థల కారణంగా భార్యను ఇబ్బంది పెడుతుండేవాడు. ఆ క్రమంలోనే 2021 జులై ఆరో తేదిన కత్తితో దాడి చేయగా ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ విషయమై అప్పటి బాడంగి ఎస్ఐ నరేష్ కేసు నమోదు చేసి, సూరిబాబును అరెస్టు చేశారు. నేరం రుజువు కావడంతో జడ్జి.. సూరిబాబుకు జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. భార్యను హింసించినందుకు ఏడాది సాధారణ జైలు శిక్ష, రూ.500 జరిమానా, హత్యాయత్నానికి పాల్పడినందుకు మూడేళ్ల సాధారణ జైలు శిక్ష, రూ.10 వేలు జరిమానా విధించారు. రెండు శిక్షలు ఏకకాలంలో అనుభవించాలని తీర్పునిచ్చినట్లు ఎస్ఐ జయంతి వెల్లడించారు.

IN THE HON'BLE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE VIZIANAGARAM O.S. 641/2023

Between:
State Bank of India Fort Branch represented by SRI TRILOCHAN BEHARA S/o RAGHUNADH BEHARA, aged 45, Chief Manager Fort branch Vizianagaram. ....Plaintiff

And:
CHENNA SURESH KUMAR ....Defendant

NOTICE
Hearing Date:3-07-2024

To
CHENNA SURESH KUMAR S/O KRISHNA RAO, resident of Door No. 10-8/3-66, FC Godown-Lankapatnam Vizianagaram 535002

Please take notice that the above matter is posted to **03-07-2024** .You shall appear in person or through your Advocate, by **10.30 AM**, failing which the matter will be decided Ex Partee.

PVS Prasad
Advocate for the Plaintiff
Vizianagaram,
Cell:7799955633

BEFORE THE HONOURABLE COURT OF THE PRINCIPAL DISTRICT JUDGE AT VIZIANAGARAM A.S.No.4/2024

Between:
Smt. Challa Syamala ....Appellant
And:
Helima Begum .....Respondent
TO
RESPONDENT: Helima Begum, W/O.Srinu Rehman, C/O.Mohammad Aslam, D.No.25-3-22, Opp: Satish Kiran Shop, Near: PWD Office, Sunkari Veedhi, Vizianagaram.

NOTICE

Please take notice that the above matter is posted to **dt.08-07-2024** for notice to the respondent. So, you should appear in person or through an Advocate at 10-30 a.m., on the above said date before the said court. If you fail to appear before the said court on the said date, the matter will be decided in your absence and set you exparte.

By Order of the Court.
Sri U. RAVI SANKAR
Advocate for the Appellant
Maharanipeta
VIZIANAGARAM
Ph: 98496 39233

IN THE HON'BLE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE VIZIANAGARAM O.S. 193/2023

Between:
M/s. Indian Bank.
Having its office at M/s. Indian Bank, PSN Estates near RTC Complex Lower tank Bund Road-Vizianagaram-535003 Rep: by its authorized signatory Sri RSMCH Anand S/o Prakasa Rao Occ: Branch Manager, PSN Estates near RTC Complex Lower tank Bund Road-Vizianagaram. ....Plaintiff

1. Harish Guptha S/o Ashok Guptha Door No.8-31/1/175/C Koneti Street Thotapalem Vizianagaram
2. Shyam Sundar Guptha S/o Haridwar Prasad Guptha Door No.22-10-70 Kota Veedi colony Near Park Vizianagaram ....Defendants

NOTICE
Hearing Date 2-07-2024

To
1. Harish Guptha S/o Ashok Guptha Door No.8-31/1/175/C Koneti Street Thotapalem Vizianagaram
2. Shyam Sundar Guptha S/o Haridwar Prasad Guptha Door No.22-10-70 Kota Veedi colony Near Park Vizianagaram

Please take notice that the above matter is posted to **2-07-2024.**You shall appear in person or through your Advocate, by **10.30 AM,** failing which the matter will be decided Ex Partee.

PVS Prasad
Advocate for the Plaintiff
Vizianagaram,
Cell:7799955633

IN THE HON'BLE COURT OF THE I ADDITIONAL JUNIOR CIVIL JUDGE VIZIANAGARAM O.S. 192/2023

Between:
M/s. Indian Bank.
Having its office at M/s. Indian Bank, PSN Estates near RTC Complex Lower tank Bund Road - Vizianagaram-535003 Rep: by its authorized signatory Sri RSMCH Anand S/o Prakasa Rao Occ: Branch Manager, PSN Estates near RTC Complex Lower tank Bund Road-Vizianagaram. ....Plaintiff
And:
1. Sri Venkata Ayyappa Traders represented by its Sole proprietor Sri Gongunta Narasimhulu resident of Door No.10-09-20 Sudda Veedi Near Sita Ram Temple Hukumpeta Vizianagaram (Borrower)
2. Sri Gongunta Prasad S/o Gongunta Narasimhulu (Guarantor) -- Rest do ....Defendants

NOTICE
Hearing Date 10-07-2024

To
1. Sri Venkata Ayyappa Traders represented by its Sole proprietor Sri Gongunta Narasimhulu resident of Door No.10-09-20 Sudda Veedi Near Sita Ram Temple Hukumpeta Vizianagaram (Borrower)
2. Sri Gongunta Prasad S/o Gongunta Narasimhulu (Guarantor) -- Rest do

Please take notice that the above matter is posted to **10-07-2024** .You shall appear in person or through your Advocate, by **10.30 AM,** failing which the matter will be decided Ex Partee.

PVS Prasad
Advocate for the Plaintiff
Vizianagaram,
Cell:7799955633